

ఎసిబికి చిక్కిన విఆర్‌ఒ


విఆర్‌ఒను విచారిస్తున్న ఎసిబి అధికారులు

రైల్వేకోడూరు: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని ఎల్ఐసి కార్యాలయం సమీపంలో ఎసిబి అధికారులు దాడులు జరిపి ఓబనపల్లె విఆర్‌ఒ జి.ఏసుదాసును లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడినట్లు ఎసిబి డిఎస్‌పి పి.కంజాక్షన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబనపల్లె గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ కస్తూరి ఓబయ్య నాయుడు పంచాయతీలోని పిచ్చయ్య కుంట, పెద్దకుంట, మర్రికుంట ప్రాంతాలలో చేసిన కాంట్రాక్టు పనులకు సంబంధించి బిల్లుల కోసం ఇరిగేషన్ శాఖ కోరిన విధంగా రెవెన్యూ శాఖ వద్ద ఒక సర్టిఫికెట్ అవసరమని గత ఏడాదిగా విఆర్‌ఒ ఏసుదాసును కోరుతున్నారని పేర్కొన్నారు. అతను రూ.20 వేలు లంచం అడిగాడని ఓబయ్య నాయుడు ఫిర్యాదు చేశారని చెప్పారు. విఆర్‌ఒ ఏసుదాసును వల పన్ని పట్టుకున్నామన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దారు రామ్మోహన్ ఆధ్వర్యంలో విఆర్‌ఒ ఏసుదాసును విచారించామని తెలిపారు. కార్యక్రమంలో ఎసిబి సిఐలు కె.ఎల్లమరాజు, కృష్ణమోహన్, మహమ్మద్ అలీ, నరేష్ పాల్గొన్నారు.

ఒంటిమిట్టకు

బ్రహ్మోత్సవ శోభ

◆ నేడు అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభం ◆ రేపు ధ్వజారోహణం ◆ ఏప్రిల్ 5న సీతారాముల కల్యాణం


విద్యుత్‌కాంతుల వెలుగులో ప్రకాశిస్తున్న ఒంటిమిట్ట శ్రీకోదండ రామాలయం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

కోదండరామస్వామి వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు గురువారం ఘనంగా అంకురార్పణ నిర్వహిస్తారు. శుక్రవారం నుంచి తొమ్మిది రోజులపాటు బ్రహ్మోత్సవాల నిర్వహణకు టిటిడి యంత్రాంగం భారీగా ఏర్పాట్లు చేసిన సంగతి తెలిసిందే. ఉదయం 4 నుంచి 6 గంటల వరకు వ్యాసాభిషేకం (మూలవర్లకు అభిషేకం), 7.30 నుంచి 11 గంటల వరకుమ సర్వదర్శనం, 10 గంటలకు శ్రీరామనవమి ఆస్థానం, స్నపన తిరుమంజనం ఉంటుంది. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు అంకురార్పణ నిర్వహిస్తారు. శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి.

రేపు ధ్వజారోహణం

ఈ నెల 31న ఉదయం 9 గంటలకు వృషభలగ్నంలో ధ్వజారోహణం ఉంటుంది. సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు పోతన జయంతి, కవి సమ్మేళనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శేష వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు భక్తులకు దర్శనమిస్తారు.

5న శ్రీ సీతారాముల కల్యాణం

ఏప్రిల్ 5వ తేదీన రాత్రి 8 నుంచి 10 గంటల వరకు సీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహిస్తారు. ప్రజలు రూ.750 చెల్లించి కల్యాణంలో పాల్గొనవచ్చు. వీరికి ఒక ఉత్తరీయం, రవికె, లడ్డూ ప్రసాదం బహుమానంగా అందజేస్తారు. ఆ తరువాత తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.

నేడు, రేపు కవి సమ్మేళనం

శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో శ్రీరామనవమి పర్వదినం, శ్రీ పోతన జయంతిని పురస్కరించుకుని టిటిడి హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో మార్చి 30వ తేదీ పోతన భాగవతం అంశంపై కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. 31వ తేదీ శ్రీరామ పాదుకా పట్టాభిషేకం అంశంపై కవి సమ్మేళనం జరుగుతుంది. ఆలయ ప్రాంగణంలో 30వ తేదీ మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జియస్ఆర్ కృష్ణమూర్తి అధ్యక్షతన 'పోతన భాగవతం'పై ప్రముఖ పండితులు ఎం.నారాయణరెడ్డి, రుక్మిణి సందేశం డాక్టర్ బి.గోపాలకృష్ణ శాస్త్రి, శ్రీరామ జననం, డాక్టర్ కె.సుమన, సీతారామ కళ్యాణం పి.శంకర్, భక్తి రసం వి.చిన్నయ్య, కుచేలోపాఖ్యానం ఎం.లోకనాథం, శరణాగతి తత్వం అంశాలపై కవి సమ్మేళనం ఉంటుంది. 31వ తేదీ టిటిడి అర్చక శిక్షణ కో-ఆర్డినేటర్ డాక్టర్ హేమంత్ కుమార్ అధ్యక్షతన 'శ్రీరామ పాదుకా పట్టాభిషేకం'పై ఎల్.జగన్నాథ శాస్త్రి, గడియారం వెంకట శేషశాస్త్రి రామాయణం, ఎం.మల్లికార్జునరెడ్డి శ్రీ రామాయణ కల్పవృక్షం, వై.మధుసూదన్, శ్రీ రంగనాథ రామాయణం, డాక్టర్ సి.శివా రెడ్డి, శ్రీమద్ వాల్మీకి రామాయణం, యు.భరత్ శర్మ, చంపూ రామాయణం, డాక్టర్ పి.నీలవేణి మొల్ల రామాయణం అంశాలపై కవి సమ్మేళనం నిర్వహిస్తారు. శ్రీ కోదండ రామస్వామివారి ఆలయ ప్రాంగణంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా మార్చి 31 నుండి ఏప్రిల్ 8వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

> ఒంటిమిట్టకు బ్రహ్మోత్సవ శోభ వచ్చింది. నేటి నుంచి మొదలయ్యే కోదండ రామాలయం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు, పనులు పూర్తయ్యాయి. ఆలయప్రాంగణం, ఆలయాన్ని దీపాలతో అలంకరించారు. శ్రీరామనవమిపై ప్రచారం కల్పించేందుకు భారీ ఫ్లెక్సీలు, గోడపత్రాలు అంటించారు. హరిత శోభకోసం ప్రత్యేకంగా మొక్కలను తెప్పించారు. కోదండ రామాలయం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 5వ తేదీన జరుగనున్న సీతారాముల కల్యాణ ఘట్టానికి యుద్ధప్రాతిపదికన కల్యాణ వేదికను ముస్తాబు చేస్తున్నారు.


సింహవాహనంపై ఊరేగుతున్న రాఘవుడు

మృగరాజుపై లోకాభిరాముడు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిక్షేత్రంలోని శ్రీపట్టాభిరాముడి ఆలయంలో శ్రీరాముడి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం స్వామివారు కల్పవృక్ష, సింహవాహనాలపై అధిరోహించి భక్తులను కటాక్షించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సర్వాలంకారశోభితులైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడిని కల్పవృక్ష వాహనంపై అధిష్టించి తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. తదుపరి స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవమూర్తులకు ఉయ్యాల మండపంలో ఊంజల్ సేవ జరిగింది. రాత్రి 8 గంటలకు ఉత్సవమూర్తులకు సింహవాహనంపై మేళ తాళాలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ వరలక్ష్మి, ఎఇఒ గురుమూర్తి, సూపరింటెండెంట్ మునిచెంగల్‌రాయులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, సిబ్బంది దుశంత్, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 1న కల్యాణోత్సవం : బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ ఒకటవ తేదీ శనివారం జరగనున్న సీతారాముల కల్యాణోత్సవానికి టికెట్లు అందుబాటులో ఉన్నట్లు ఆలయ అధికారి క్రిష్ణమూర్తి తెలిపారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు రూ.500లు చెల్లించి, టికెట్లను పొందాలని సూచించారు. టికెట్లు కావాల్సిన వారు శ్రీ పట్టాభిరామాలయంలో సంప్రదించాలని కోరారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు సర్వభూపాల వాహనం, 10గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6గంటలకు ఊంజల్ సేవ, రాత్రి 8గంటలకు పెద్దశేష వాహన సేవ.

రాహుల్‌పై రాజకీయ కక్ష సరికాదు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్షతో లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయడం నియంతృత్వ పాలనకు నిదర్శనమని ఎపిసిసి కార్యవర్గ సభ్యులు అత్తింజేరి శ్రీనాథ్ అన్నారు. బుధవారం ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం మోడీ అదాని చీకటి కుంభకోణాలను రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రశ్నించటం వల్ల అనర్హత వేటు వేయడం సిగ్గు చేటన్నారు. ఈ విషయం దేశప్రజాలు గమనిస్తున్నారన్నారు. ఇది ప్రజా స్వామ్యనికి చీకటి రోని తెలిపారు. ప్రజాస్వామ్యనికి, రాజ్యాంగ విలువలకు చేటుకాలం దాపురించిందని పేర్కొన్నారు. దేశ ప్రజల హక్కుల కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని ఆపటం ఎవరి తరం కాదని తెలిపారు.

ఎఎఫ్‌యుకు 110.36 ఎకరాలు కేటాయింపు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి 110.35 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. విశ్వవిద్యాలయ శాశ్వత భవన నిర్మాణాల కోసం పెండ్లిమర్రి మండలం గంగనపల్లె గ్రామపరిధిలోని 17/1, 17/2 సర్వేనెంబర్‌లో 110.36 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కాగా గతంలో కడప నగరపరిధిలోని చలమారెడ్డిపల్లె సమీపంలో విశ్వవిద్యాలయానికి స్థలం కేటాయించగా, దాన్ని వైవీయూ సమీపంలోకి మార్పు చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. కాగా విశ్వవిద్యాలయానికి 110.36 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించడం పట్ల విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బి.ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇసి సురేంద్రనాథ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే శాశ్వత భవన నిర్మాణాలకు సంబంధించి భూమిపూజ, శంకుస్థాపన త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి కోరారు. స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛమార్షల్ మార్చ్ సందర్భంగా పురపాలక పరిధిలోని ప్రజలకు పారిశుధ్యం పై అవగాహన కల్పించేందుకు ఆర్అండ్‌బి బంగ్లా వద్ద మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ ఎం.జనార్ధన్‌రెడ్డి పురపాలక సిబ్బందితో కలిసి మానవహారంగా ఏర్పడి ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వస్తువుల నివారణ, తడి చెత్తను పొడి చెత్తను వేరు చేయడం, గార్బేస్ ఫ్రీ సిటీ, పరిశుభ్రత పైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ-క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం పైన ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకుంటేనే స్వచ్ఛ-క్లీన్ ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో పురపాలక కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సచివాలయంలో డిఎల్‌డిఒ తనిఖీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని ఊటుకూరు సచివాలయాన్ని డిఎల్‌పిఒ నరసింహ మూర్తి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల హాజరును పరిశీలించారు. పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న పలు రకాల సర్వేలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊటుకూరు సచివాలయంలో రికార్డులన్నీ సక్రమంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల పనితీరు అభినందనీయంగా ఉందని ప్రశంసించారు. పంచాయతీ కార్యదర్శి బాల కుమార్ ను ప్రత్యేకంగా అభినందించారు. సచివాలయ సిబ్బంది డ్రెస్ కోడ్ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మణికంఠ, డిజిటల్ అసిస్టెంట్ రాణి, ఉద్యాన సహాయకులు పూర్ణచంద్ర, సచివాలయ సహాయకులు వెంకటయ్య, సాయి పాల్గొన్నారు.

'పది' పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలో ఏప్రిల్ 3 నుంచి 18 వతేదీ వరకు ప్రశాంత వాతావరణంలో పదవ తరగతి పరీక్షలను నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. బుధవారం పదవ తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, విద్యాశాఖ అధికారులతో పరీక్షా కేంద్రాలలో చేయవలసిన ముందస్తు ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీష, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డిఆర్‌ఒ సత్యనారాయణ, డిఇఒ పురుషోత్తం, డిఎంహెచ్‌ఒ డాక్టర్ కొండయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఈ పరీక్షలను ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాలలో ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తగు భద్రత కల్పించాలని, అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్స్ తో పాటు ఒక సబ్ ఇన్స్పెక్టర్ను, తహశీల్దారును కేటాయించాలన్నారు. పరీక్షలు ముగిసిన పిదప జవాబు పత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ వద్ద కూడా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ గిరీష మాట్లాడుతూ జిల్లాలో 123 పరీక్ష కేంద్రాల్లో 22,395 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయడం జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాలలో అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తాగునీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని, విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం 7.00 గంటల నుండి పరీక్షా కేంద్రాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ వారికి సూచించడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తగు భద్రత ఏర్పాటు చేయాలని, పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ అమలు చేసి జిరాక్స్ సెంటర్లు మూసివేయించాలన్నారు. పదవ తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

మహిళాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం : 'గడికోట'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మహిళాభ్యున్నతే జగన్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మార్కెట్ ఉర్దూ పాఠశాలలో గాలివీడు రోడ్డు, భట్టు స్ట్రీట్, వాల్మీకి స్ట్రీట్, పాత రాయచోటి, బ్రాహ్మణ స్ట్రీట్ సచివాలయాల పరిధిలోని స్వయం సహాయక సంఘాలతో జరిగిన మూడవ విడత వైఎస్ఆర్ ఆసరా సదస్సులో కలెక్టర్ గిరీషతో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అక్క చెల్లెమ్మలుకు ఇచ్చిన మాటను జగన్ నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ కేలండర్‌ను ఏర్పాటు చేసి, ఏ పథకాన్నైనా నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారన్నారు. వైఎస్ఆర్ చేయూత, ఆసరా తదితర ఎన్నో పథకాలును అమలు చేస్తున్నారన్నారు. మహిళలకు భద్రతగా దిశ చట్టం, మహిళా పోలీసు స్టేషన్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధికి, జగనన్న ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధికి బేరీజు వేసుకోవాలని తెలిపారు. కౌన్సిలర్ వెంకట జ్యోత్స్న కుమారి మాట్లాడుతూ మహిళల జీవితాలలో సిఎం జగన్ వెలుగులు నింపుచున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మదనపల్లె పరిశీలకులు హబీబుల్లా ఖాన్,జిల్లా మైనారిటీ అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, ఆసీఫ్ అలీఖాన్, అన్నా సలీం, యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన మోహన్ రెడ్డి,గువ్వల లక్ష్మీదేవి, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, గన్నామంతి బాలాజీ, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జాఫర్ అలీఖాన్, కొత్తిమీర ప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎండియు ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మదనపల్లె మండల ఎండియు ఆపరేటర్స్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మదనపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అనంతరం డిటి, ఆర్ఐలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి రాష్ట్ర సమైఖ్య ఎండియు ఆపరేటర్ల మదనపల్లి యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎండియు వాహనాలకు సంబంధించిన ఇన్సూరెన్స్ ప్రభుత్వం చెల్లిస్తామని తెలిపిన, రూ.11 వేలు వచ్చే ఇన్సూరెన్స్ ఈ ఏడాది రూ.18,897 ఎందుకు పెంచారని ప్రశ్నించారు. ఎండియు వాహనాలకు సంబంధించి ఇన్సూరెన్స్, ఎఫ్సీలు జనవరి 20వ తేదీతో గడువు ముగిసిందని, కావున ప్రభుత్వమే రెన్యువల్ చేయాలన్నారు. ఇన్సూరెన్స్ పత్రాలలో వెహికల్,చాసిస్ నెంబర్లు సరిగ్గా లేవని వాటిని పరిష్కరించాలన్నారు. 5 నెలలు నుండి ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్లకు మధ్యాహ్న భోజన పథకం స్కూళ్లకు రేషన్ సరఫరా చేస్తున్నా దానికి సంబంధించిన బకాయిలు ఇప్పటివరకు జమ కాలేదని పేర్కొన్నారు.ఖాటా మిషన్‌కు,ఈ పాస్ మిషన్లకు సంబంధించి చార్జర్లు స్పేర్ పార్ట్స్ బయట అందుబాటులో లేవని, అవి లభ్యమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోర్టబుల్ కార్డ్స్ సంబంధించిన సరుకులు తమకు అందడం లేదని,ఈ విషయంలో వీఆర్వోలను, సిఎస్డిటీలను అడిగితే కార్డులు మ్యాపింగ్ లేనందువల్ల ఇబ్బందులు వస్తున్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు.ఈనెల 31లోపు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించని పక్షంలో ఏప్రిల్ నెల 1 నుండి ఎండియు వాహనాలను నడపలేమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు అనిల్, ఉపాధ్యక్షులు షాకీర్, సభ్యులు నవాజ్, ముబారక్, మస్తాన్, శివ కుమార్, వినోద్ కుమార్, సుదర్శన్, అశోక్, వెంకటేష్ తోపాటు పలువురు పాల్గొన్నారు.


టిడికి వినతిపత్రం అందజేస్తున్న ఆపరేటర్లు

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా జనార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

మదనపల్లి బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం యూనియన్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో న్యాయవాదుల సంఘం అధ్యక్షులుగా పి. జనార్ధనరెడ్డి 82 ఓట్ల మెజార్టీతో గెలుపొంది అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. అనంతరం ఉపాధ్యక్షులు టి.వెంకటరమణరెడ్డి, జనరల్ సెక్రటరీగా మనోహర్, జాయింట్ సెక్రటరీ సోమశేఖర్, ట్రెజరర్ సురేష్ బాబు, లైబ్రరీ సెక్రటరీ ఎవి ప్రసాద్, లేడి రెప్రజెంటేటీవ్, సుజాతలతో పాటు ఇసి మెంబర్లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని బిల్డింగ్ వర్కర్స్ ప్రెసిడెంట్ రెడ్డి సాహెబ్ శ్రీనివాసులు సన్మానించారు.

ఒంటిపూట బడులు నిర్వహించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పాఠశాలలకు తక్షణమే ఒంటి పూట బడులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పిడిఎస్‌యు మండల నాయకులు సుదర్శన్ డిమాండ్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రోజురోజుకు ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఎండలకు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రతి ఏటా మార్చి 15వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహించే వారని, ఏప్రిల్ మాసం ఆరంభమవుతున్నా ఈ ఏడాది ఒంటిపూట బడులు ప్రారంభించకపోవడం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు పట్టణ కమిటీ సభ్యులు అజయ్, ప్రేమేష్, హరిశ్చంద్ర, అగ్ని, నరసింహ పాల్గొన్నారు.

30 శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇవ్వాల్సిందే

ప్రజాశక్తి-కడప అర్బన్

ఒక జీవితకాలం కుటుంబం కోసం, సంస్థ కోసం, దేశం శ్రమించిన ఉద్యోగులకు రిటైరయ్యాక గౌరవప్రదమైన జీవితమన్నది ఒక హక్కని ఎల్ఐసి పెన్షనర్ల, సిబ్బంది సంఘాల నేతలు సుధీకర్, రఘునాథరెడ్డి, చంద్రపాల్ అన్నారు. స్థానిక ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం ఎదుట దేశవ్యాప్త పిలుపుమేరకు జరిగిన పెన్షనర్ల ధర్నా, సంఘీభావ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థలో 23 వేల మంది ఫ్యామిలీ పెన్షనర్లకు వర్తించే 30 శాతం ఫ్యామిలీ పెన్షన్ ప్రతిపాదనను యాజమాన్యం మూడున్నరేండ్ల కిందటే సిఫారసు చేసినా, కేంద్ర ఆర్థిక శాఖ ఇప్పటికీ తేల్చకపోవడం అభ్యంతరకమని అన్నారు. ఆర్‌బిఐ, జాతీయ బ్యాంకులు, నాబార్డ్, గ్రామీణ బ్యాంకుల్లో 30 శాతం ఫ్యామిలీ పెన్షన్ నిర్ణయాన్ని ఇప్పటికే అమలులోకి తెచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ జరిగినప్పుడల్లా పెన్షన్ అప్డేషన్ చేస్తున్నారని, బీమా సంస్థల్లో కూడా దీన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో, పెన్షనర్ల, ఉద్యోగ సంఘాల నాయకులు అవధానం శ్రీనివాస్, శంకరరావు, కస్తూరి, ఈశ్వర్ రెడ్డి, నాయుడు, ఎల్లారెడ్డి, ఆనందరావు, రెడ్డి భాస్కర్, వారిజాతమ్మ, శ్రీకృష్ణ, పర్వీన్, రాజు, కుమార్ పాల్గొన్నారు.


మెగా మార్ట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

మెగా మార్ట్‌ను ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాయచోటిలో వాణిజ్య మెగా మార్ట్‌లు ఏర్పాటు చేయడం హర్షణీయమని కలెక్టర్ గిరీష,ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని మాసాపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన విశాల్ మెగా మార్ట్‌ను వారు ప్రారంభించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించి మన్ననలును పొందాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, నాయకులు ఆసీఫ్ అలీఖాన్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, మదనమోహన్‌రెడ్డి, సుగవాసి శ్యామ్, ఫయాజ్ అహమ్మద్, గౌస్ ఖాన్, పల్లా రమేష్, జానం రవీంద్ర యాదవ్, మనం సేవా సంస్థ అధ్యక్షుడు ప్రకాష్, మాజీ కో-ఆప్షన్ జాఫర్ అలీ ఖాన్, జావీద్, అమీర్ పాల్గొన్నారు.

చిన్న పిల్లల పార్క్ ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పట్టణంలోని కొత్తపేట రామాపురంలోని డైట్ హాస్టల్ ప్రాంగణంలో సర్వాంగ సుందరంగా చిన్న పిల్లల పార్క్, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణాలకు కృషి చేస్తామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులుతో కలసి డైట్ ప్రాంగణంలో కలియతిరిగారు. త్వరలోనే వాకింగ్ ట్రాక్, చిన్నపిల్లల పార్క్, మొక్కల పెంపకం, బల్లల ఏర్పాటును త్వరితగతిన ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులును ఆదేశించారు. అనంతరం ఆయన నూతన పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. పట్టణంలో అదనపు సిసి కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, కమిషనర్ గంగా ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మదనమోహన్‌రెడ్డి, ఆనందరెడ్డి, జయన్న నాయక్, భాస్కర్, డిఎస్‌పి శ్రీధర్, సిఐ సుధాకర్ రెడ్డి, ఎస్ఐలు నరసింహా రెడ్డి, రఫీ, ఇనాయతుల్లా, మదనపల్లె పరిశీలకులు హబీబుల్లా ఖాన్, యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదనమోహన్ రెడ్డి, ఆసీఫ్ అలీఖాన్, వ్యవసాయ జిల్లా సలహా కమిటీ సభ్యుడు దిన్నెపాడు రవిరాజు పాల్గొన్నారు.


నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి

ఆదరించండి : ఎమ్మెల్యే 'పెద్దిరెడ్డి'

ప్రజాశక్తి తంబళ్లపల్లె

అభివృద్ధి, సంక్షేమ పాలన కోసం మరోసారి వైసిపి ఆదరించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కన్నమడుగు, కేరామిగాని వల్లె, హరిజనవాడ, కుదుములవారిపల్లె, నల్లమరెడ్డిగారిపల్లె, గొల్లవారిపల్లె, లక్ష్మీపురం లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధి సమాచారాన్ని వివరించారు. కన్నమడుగు పంచాయతీలో జల జీవన్ మిషన్ ద్వారా రూ.29.70 లక్షల ఖర్చుతో ఇంటింటికి కుళాయిలు ఏర్పాట్లు ఆయన ప్రారంభించారు. సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి గ్రామ ప్రాంతంలోని పేద,మధ్యతరగతి ప్రజల అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగిస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎండియు ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మండల ఎండియు ఆపరేటర్స్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అనంతరం డిటి హరికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండియు వాహనాలకు ఇన్సూరెన్స్ ప్రభుత్వమే భరిస్తుందన్నారు. గతేడాది వాహనాలకు రూ.11 వేలు వచ్చిందని, ఈ ఏడాది రూ.18,897 వేలకు పెంచారన్నారు. వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్లను రెండేళ్ల గడువుతో ఇవ్వాలని, ఆ ఖర్చును తాము భరించలేమని ప్రభుత్వమే భరించాలన్నారు. ఎండియు ఆపరేటర్లకు ఇన్సూరెన్స్ సంబంధించిన పాత బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఈనెల 31లోపు ఎండియు ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని, లేనియెడల ఏప్రిల్ 1 నుంచి ఎండియు వాహనాలను నిలిపి వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఎండిఒ అధ్యక్షులు బి.రాము ఉపాధ్యక్షులు అశోక్, చౌడప్ప, వారిస్, శివశంకర్, రమణప్ప, హరీష్ పాల్గొన్నారు.

భూమి, భుక్తి కోసం నిరంతర పోరాటం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

గ్రామీణ ప్రాంతాల లోని వ్యవసాయ కూలీలు భూమి, భుక్తి, ఆహార భద్రత కోసం నిరంతరం పోరాడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని వారు జీవన సమతుల్యతను సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల [illegible] అన్నారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో మండల, గ్రామీణ కమిటీ సభ్యులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని వ్యవసాయ కూలీలు, ఇతర వృత్తుల కూలీలు అనేక సమస్యలతో దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. ప్రభుత్వ చౌకదుకాణాల్లో బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారని, నిత్యావసర వస్తువులు, పప్పుధాన్యాలను సబ్సిడీ ధరలో పంపిణీ చేయాలన్నారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.1200 పైగా ఉందని, చాలీచాలని కూలీలతో గ్యాస్ సిలిండర్ ను కొనడానికి కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. భూమిలేని మహిళా కూలీలకు ఐదు ఎకరాల సాగు యోగ్యమైన భూమిని పంపిణీ చేయాలని తెలిపారు. అధికారులు స్పందించి వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిఎయు మండల కార్యదర్శి చంద్రశేఖర్, మండల, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంచి ఆలోచనలతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి-గాలివీడు

పదవ తరగతి పరీక్షలు సిద్ధపడుతున్న విద్యార్థులు మంచి ఆలోచనలతో ముందుకు సాగాలని గ్రామ సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డన్న అధ్యక్షతన జరిగిన 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు ఇచ్చిన వీడ్కోలు సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులంతా ఇష్టంతో కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. ఎంపిడిఒ శేఖర్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో మంచి నాయకత్వ లక్షణాలు ఎంపిక చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక వైద్యాధికారి, బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, రాజశేఖర్, గోపాలకృష్ణనాయక్, మహమ్మద్‌గౌస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

3న గాలివీడు మండల సమావేశం

గాలివీడు : మండల సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 3వ ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఎంపిపి జిల్లా సుదర్శన్ రెడ్డి, ఎంపిడిఒ శేఖర్ నాయక్ సంయుక్త ప్రకటనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి జడ్‌పిటిసి ఎంపిటిసిలు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

4న బి.కొత్తకోటలో ...

బి.కొత్తకోట : మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 4న స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శంకరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఈ సమావేశంలో చర్చించనున్నారన్నారు. ఆ సమావేశానికి మండలంలోని ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

భవిష్యత్ కార్యాచరణ చాలా ముఖ్యం

ప్రజాశక్తి-కురబలకోట

ప్రతి విద్యార్థి భవిష్యత్ కార్యాచరణ చాలా ముఖ్యమని గూగుల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అజీజ్ పేర్కొన్నారు. బుధవారం అంగళ్లు సమీపంలో మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం జిఎంఐసిఎస్-23ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అజీజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్వీయ అనుభవాలు, కెరీర్ ప్లానింగ్ గురించి విద్యార్థులకు వివరించారు. కంప్యూటర్ సబ్జెక్ట్ లలోను ప్రాముఖ్యత కలిగిన అంశాలను మనం గుర్తుపెట్టుకొని, అవసరమైన సమయంలో వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఏ కోర్సు సబ్జెక్టులైనా పైథాన్, జావా, సి, సిప్లస్ మొదలైనవి నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. సుమారు 350 మంది విద్యార్థులు టెక్నికల్ పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, కోడ్ వార్, క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, టెక్ టాక్, గేమింగ్, ఇన్నోవేషన్ పిచ్ ఫెస్ట్ నాన్ టెక్నికల్ ఈవెంట్స్ లో పాల్గొనడానికి వచ్చారని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమం నిర్వహించడానికి ప్రోత్సహించిన కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల కు కృతజ్ఞతలు తెలియజేశారు.

టిబి రోగులకు పోషకాహారం పంపిణీ

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో టిబి వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ సృజన, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి పిలుపుమేరకు జనాబ్ ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో దాతలు సయ్యద్ అమీర్, కరీముల్లా ఖాన్‌లు క్షయ వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు నెలలుగా క్షయ వ్యాధి గ్రస్తులకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. మరికొంత మంది దాతలు ముందుకొచ్చి వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు అమ్మత, తులసి, పాల్గొన్నారు. **నందలూరు:** [illegible] 15 మంది టిబి రోగులకు పోషకాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిబి సూపర్‌వైజర్ రామకృష్ణ, సిహెచ్ షకీలాబేగం, ఎంఎల్‌హెచ్‌పి రమణయ్య, రెడ్డెప్ప, ఎఎన్ఎం గీతాభవాని పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-రాయచోటి

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను టిటిడి మాజీ బోర్డు మెంబర్ సుగువాసి ప్రసాదబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి కార్యాలయంలో నాయకులు,కార్యకర్తలు,అభిమానుల ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం నివాళి అర్పించారు. కార్యక్రమంలో సుబ్బయ్య నాయుడు, రాజేంద్ర నాయుడు, శ్రీనివాస్ నాయుడు, రవీంద్ర నాయుడు, అనుంపల్లె రాంప్రసాద్ రెడ్డి , బోనమల ఖాదరవలి, గుదే నాగార్జున, పల్లపు వాసు, బసయ్య, మల్లికార్జున, సహదేవ,బడిశెట్టి రవి, జనార్ధన్, మండ్ల సతీష్,నాగ,మస్తాన్, మహేష్, చెన్నకృష్ణ నాయుడు,బలరాం,వాకా వాసు, రెడ్డి, మస్తాన్, కోటి,నాని,మన్నేరు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. **పీలేరు** :కాంగ్రెస్ కంచు కోటల్ని బద్దలు కొట్టిన ధీశాలి నందమూరి తారక రామారావు అని టిడిపి నాయకులు తెలిపారు. బుధవారం తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దివంగత ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి అతి తక్కువ కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 35 లోక్ సభ స్థానాలు, 202 అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకొని తెలుగోడి సత్తా చాటి, టిడిపి జెండాను ఢిల్లీ పురవీధుల్లో రెపరెప లాడించారని అన్నారు. **పెద్దమండ్యం :** నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి శంకర్‌యాదవ్ ఆదేశాలు మేరకు పెద్దమండ్యం మండల కన్వీనర్ జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండలం నాయకులు, గ్రామ నాయకులు, అనుబంధ కమిటీ మెంబర్లు,ఇతర నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి:** మండల హెడ్ క్వార్టర్‌లో రాయచోటి నియోజకవర్గం బాధ్యులు ఆర్.రమేష్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి 41 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాలాడి ప్రభాకర్‌రెడ్డి, కార్యకర్తలు ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి స్వగృహంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో నాగేంద్రరెడ్డి, సర్పంచ్ చెంద్రాయుడు, మాజీ మండల ఉపాధ్యక్షులు వెంకటరమణ, రాజంపేట పార్లమెంట్ ఆర్‌ఎంపి కార్యదర్శి షఫీ నాయక్, షేక్ అమీర్, రవిరెడ్డి, మోటుపల్లి రెడ్డిశేఖర్, ముక్త హమమ్మెద్ గౌస్ పీం పాల్గొన్నారు. **చిన్నమండెం:** టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడులకను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. టిడిపి ఇన్‌ఛార్జి నరసింహారెడ్డి అధ్యక్షతన పార్టీ జెండా ఎగుర వేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో రాజంపేట బిసి సెల్ ప్రధాన కార్యదర్శి అలగాని రెడ్డప్ప, రాజంపేట పార్లమెంట్ రైతు ఉపాధ్యక్షులు గుదే చెన్న కృష్ణారెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు తౌహీద్ ఖాన్, భాషిత్ ఖాన్, గోపాల్, రామచంద్ర, మల్లు, పార్టీ గ్రామ అధ్యక్షుడు సిరాజ్‌అలీఖాన్, షాబుద్దీన్‌ఖాన్, తాజుద్దీన్ ఖాన్, రవీంద్రనాథ్ శ్రేష్ఠి, జిలాని ఖాన్ పాల్గొన్నారు.**నందలూరు:** టిడిపి మండల అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, మాజీ రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్, పల్లె సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో టిడిపి జెండా ఎగరవేసి స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు భారతాల శ్రీధర్ బాబు యాదవ్, చుక్క యానాది, మోడపోతుల రాము, తాటి సుబ్బరాయుడు, జ్యోతి శివ, చామంచి పెంచలయ్య, గంగనపల్లి శ్రీనివాసులు, మునుస్వామి, గణపతి, గౌస్‌బేగ్, కానకుర్తి వెంకటయ్య, టిఎన్‌ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు. **కలికిరి :** స్థానిక నాలుగు రోడ్ల కూడలి గాంధీ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి హనీఫ్, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, మాజీ జడ్‌పిటిసిలు మాలతి, రహమతుల్లా, మండల ఉపాధ్యక్షుడు రెడ్డి, పులి సత్యనారాయణ రెడ్డి మాజీ ఎంపిటిసి జనార్ధన్ గౌడ్, అగస్తీశ్వర్, శ్రీనివాస్ వర్మ, అశోక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **వీరబల్లి :** మండలంలో బస్టాండ్ ఆవరణంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల అర్పించారు. సీనియర్ నాయకులు రెడ్డప్ప రెడ్డి, మాజీ సర్పంచులు నేతి వెంకటరమణ, వెంకటరామరాజు, లక్ష్మయ్య లతోపాటు సీనియర్ నాయకులు నాగసుబ్బయ్య నాయుడు, రామ్మోహన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, ఆంజనేయులు రెడ్డి, జగిలి రామచంద్ర, గంగయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు నాగ


పీలేరు : టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు

సుబ్బమ్మ, ప్రధాన కార్యదర్శి తోళ్ల సురేంద్ర, బిసి నాయకులు ఆంజనేయులు లను దుశ్శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రాజు, నేతి రమేష్ బాబు, దుర్గంఆంజనేయులు, రమణ నాయుడు, ఆంజనేయులు నాయుడు, వెంకటేష్ నాయుడు, వెంకటరమణ నాయుడు, ఎంటి నాగార్జున, పవన్ కళ్యాణ్, సీతారామరెడ్డి, చలపతి వర్ల ఆంజనేయులు, సుబ్బరామరాజు, మధుసూదన్ రాజు, ఇబ్రహీం, రామకృష్ణ, సుబ్బరామయ్య, ఆటో శివా, మహేష్, వినయ్, రాజ కొండ, మనోహర, నాగమ్మ పాల్గొన్నారు. **రామాపురం:** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి రామకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. స్వర్గీయ ఎన్‌టి.రామారావు పార్టీని స్థాపించి 41 సంవత్సరాలు పూర్తి సందర్భంగా తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేసి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి, భవనం రెడ్డి, వెంకటరామిరెడ్డి, రాంబసిరెడ్డి సహదేవ రెడ్డి, చిట్టి రెడ్డయ్య, ఎండి రాజు, గణపతి గాలివీటి నాగేందర్ రెడ్డి చాంద్ బాషా రాజారావు, బాబు బాబు, ఆంజనేయ రెడ్డి గణేష్‌లు పాల్గొన్నారు.**చిట్వేలు:** మండల పరిధిలోని స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు, నాయకులు కెకె చౌదరి పిలుపుమేరకు టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు ఏదోటి రాజశేఖర్ ,బాలకృష్ణ యాదవ్, పెద్దూరు రాజా, గుండాల యాదవ్, బాలాజీ, అనంతయ్య, షబ్బీర్ సాహెబ్, కరీంబాషా, ఎస్‌సిసెల్ మండల అధ్యక్షుడు పెంచలయ్య, కొత్తూరు ఈశ్వరయ్య, నరసింహులు, గూడూరు నాగరాజు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** టిడిపి 41 వ ఆవిర్భావ దినోత్సవాన్ని రాజంపేట మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బైపాస్ రోడ్డులో గల టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **ములకలచెరువు :** మండల టిడిపి కన్వీనర్ పాలగిరి సిద్ధ ఆధ్వర్యంలో స్థానిక మూడు రోడ్లు కూడలిలో దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మౌలా, కట్టాహరి, వెంకటస్వామి, రామాంజులు, కెవిరమణ, శివన్న, రమణప్ప, సుబ్బినాయుడు, రెడ్డెప్ప పాల్గొన్నారు.

పుల్లంపేట : టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు ఆర్.సుధాకర్ నాయుడు, రైల్వే కోడూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నేలపాటి రామచంద్రయ్య నాయుడు, నాయకులు నూకల ఫనిష్ కుమార్, కేశనేని నారాయణ నాయుడు, గండికోట రామకృష్ణ, మండల ఉపాధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, కొత్తపేట శివయ్య, ఆకేపాటి సుధాకర్ రెడ్డి, పోతినేని భరత్, నాగినేని వెంకటసుబ్బయ్య నాయుడు, పల్లపు జనార్ధన, వీరపరాజు శంకరరాజు,పచ్చ హరి పాల్గొన్నారు.

నిమ్మనపల్లి: మండలంలో టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల నాయకులు, కార్యకర్తలు విస్మరించారు. నిమ్మనపల్లి మండలంలో మాత్రం పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించడంలో మండల నాయకులు విఫలమయ్యారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులు గెలుపును సాధించి, ప్రజల్లోకి టిడిపి దూసుకుపోతున్న సమయంలో పార్టీ ఆవిర్భావ వేడుకలను పార్టీ శ్రేణులను జరుపకపోవడం చర్చనీయాంశంగా మారింది.

వైఎస్ఆర్ ఆసరాతో ఆర్థికాభివృద్ధి

-ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-పుల్లంపేట


మహిళలకు మెగా చెక్‌ను అందజేస్తున్న ప్రభుత్వ విప్

వైఎస్ఆర్ ఆసరాతో మహిళలకు ఆర్థిక లబ్ధి చేకూరు తుందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిధిలోని స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 483 గ్రూపులకు కాను రూ.4.19 కోట్లు అందించామని అన్నారు. మహిళా సాధికారతే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రైల్వే కోడూరు సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, మండల అధ్యక్షుడు ముద్ద బాబుల్ రెడ్డి, తాసిల్దార్ నరసింహ కుమార్, ఎంపిడిఒ ప్రకాశం, వైస్ ఎంపిపి జయశంకర్ నాయుడు, మండల జెపిఎస్ కన్వీనర్ నాగిరెడ్డి హరినాథ్ రెడ్డి, జడ్పిటిసి రామనాథం, ఎంపిటిసి సుబ్బరాయుడు, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రొంపిచర్ల లక్ష్మీనారాయణ, పసుపులేటి వెంకటరమణ, కుమార్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, శంకర్ రెడ్డి, నలిని కాంత్ రెడ్డి, మణికంఠ, రైల్వే కోడూరు సిసి వెంకటేశ్వర్లు, ఏపిఎం సుబ్బలక్ష్మమ్మ, వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు సభ

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభను ఉల్లాసంగా..ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయ లక్ష్మమ్మ మాట్లాడుతూ విద్యార్థులందరూ పరీక్షకు హాజరై వందశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీహరి, పద్మనాభయ్య, సుబ్బయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కానరాని బిసి కార్పొరేషన్లు..జాడలేని చైర్మన్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎపిలో 56 బిసి కార్పొరేషన్లు నిధులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఎపి బిసి హక్కుల పోరాట సమితి కార్యాలయంలో ఎపి బిసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బోడెం రాజశేఖర డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నీరుగట్టువారిపల్లెలో బోడెం రాజశేఖర ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బోడెం రాజశేఖర మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 56 బిసి కార్పొరేషన్లలో రిజర్వేషన్లు, కార్పొరేషన్లు రుణాలు, 56 బిసి కార్పొరేషన్లకు చైర్మన్లు అయితే మిగిలిన కులాలవారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రామలింగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగినేని గోవిందు, రాయల సీమ ప్రధాన కార్యదర్శి మణి శంకర్, ఉమ్మడి జిల్లాల కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మన్న,పట్టణ అధ్యక్షులు రామకృష్ణ, పట్టణ గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులు, పట్టణ యూత్ వైస్ ప్రెసిడెంట్ మల్లికార్జున, పట్టణ ఉపాధ్యక్షులు విశ్వనాధ్, గౌరవ అధ్యక్షులు చెన్నం వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు గురుమూర్తి, జిల్లా కార్యదర్శి బండి రామచంద్ర, రమణ పాల్గొన్నారు.

వాల్మీకి, బోయలను ఎస్‌టిలుగా గుర్తించాల్సిందే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మార్చి 24న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాయలసీమలో వున్న వాల్మీకి/బోయలను మాత్రమే ఎస్‌టిలుగా గుర్తించి తీర్మానం చేసి కేంద్రానికి సిపారస్సు చేయడంపై ఎపి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు నాగినేని గోవిందు అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బుధవారం స్థానిక వాల్మీకి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మిగిలిన గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, కృష్ణ జిల్లాల వాల్మీకి బోయలను ఎస్‌టిలుగా వ్యతిరేకించడం చాలా బాధాకరమన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సీమ, ఆంధ్ర అని విడదీయడం దుర దృష్టకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకి బోయలందరిని ఎస్‌టిలుగా తీర్మానం చేసి కేంద్రానికి సిపారస్సు చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మక్కినేని వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మనపల్లి లక్ష్మన్న, చెన్నం వెంకటరమణలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్ట్ 'గ్రేడింగ్ టెస్ట్'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక సొసైటీ కాలనీలోని విజయభారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్ సేతు హాజరై విద్యార్థులకు ప్రశంసా పత్రం, బెల్టు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.సేతు మాట్లాడుతూ విద్యార్థులు నేటి పరిస్థితులలో చదువుతో పాటు ఆటపాటల్లో కూడా రాణించాలని అన్నారు. చిన్న వయసు నుంచే కరాటే శిక్షణ ఇప్పించడం ద్వారా పిల్లలకు ఆరోగ్యం, ఏకాగ్రత, క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. గ్రాండ్ మాస్టర్ డాక్టర్ ఎఆర్. సురేష్ మాట్లాడుతూ కరాటే వల్ల సంపూర్ణ ఆరోగ్యం, ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం, ఆత్మసైర్యం, ఆత్మ విశ్వాసం, శారీరక ధృఢత్వం, ఆత్మరక్షణ, క్రమశిక్షణ లభిస్తుందని ప్రస్తుత సమాజంలో విద్యార్థులు తప్పనిసరిగా కరాటే విద్యను నేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కరాటే క్లబ్ జనరల్ సెక్రెటరీ, సీనియర్ ఇన్స్ట్రక్టర్, మం.మణిసాయి కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

బి.కొత్తకోట :బుధవారం నగర పంచాయతీ కార్యాలయపు ఆవరణంలో ఒక చలివేంద్రం,నగర పంచాయతీ పరిధిలో ఉన్న ఐదు సచివాలయాలు, బస్టాండ్ ప్రాంతాల్లో రెండు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి వెల్లడించారు. చలివేంద్రాలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. **కలకడ :** మండలంలోని కదిరాయి చెరువు పంచాయితీ కదిరాయి చెరువు మద్రిపాడు బస్సు షెల్టర్‌లో డిపిఒ ధనలక్ష్మి చేతులమీదుగా చలివేంద్రం ప్రారంభించారు. సర్పంచ్ లక్ష్మీప్రసన్న కమల్‌నాథ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లి బస్సుషెల్టర్‌లో డిటి సయ్యద్‌అహ్మాద్ చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ నారాయణ, ఆర్ఐ మస్తాన్‌కమలాకర్, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఎలు, సచివాలయ సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, గ్రామస్తులు, పాల్గొన్నారు. **రామాపురం :** స్థానిక తాహశీల్దార్ కార్యాలయంలో తాహశీల్దార్ సత్యానంద్ ఆధ్వర్యంలో వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో 13గ్రామాలకు చెందిన కార్యదర్శులు,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-కలకడ

చెత్త నుండి సంపద తయారు చేయు కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీలో ఏర్పాటుచేసిన చెత్త నుండి సంపద తయారు కేంద్రాన్ని తనిఖీ నిర్వహించి సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ నారాయణ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శి జయచంద్ర, నాయకులు మోహనరాజానాయుడు, సురేష్‌నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్‌పి చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకం అందుకుంటున్న సురేష్

విధినిర్వహణలో దిట్ట ఎస్‌బి కానిస్టేబుల్ సురేష్ : ఎస్‌పి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల పరిధిలో చోటుచేసుకునే ప్రమాదాలు, నేరసమాచారం, ఇతర విషయాలను ఉన్నతాధికారులకు సకాలంలో చేరవేయడంలో బి.కొత్తకోట స్పెషల్ బ్రాంచ్ పోలీస్ కానిస్టేబుల్ సురేష్ దిట్ట అని ఎస్‌పి హర్షవర్ధన్ రాజు కితాబునిచ్చారు. ఇటీవల ముగిసిన ఎన్నికలు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రను విధులను పకడ్బందీగా నిర్వహించినందుకు ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు చేతుల మీదుగా సురేష్ నగదు బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సకాలంలో సమాచారాన్ని చేసి నేరాల నివారణకు సురేష్ చేసిన సేవలు ప్రశంసనీయమని, భవిష్యత్తులో మరింత బాగా పనిచేయాలని సూచించారు. అనంతరం స్పెషల్ బ్రాంచ్ సురేష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో తన సేవలను గుర్తించి ఎస్‌పి చేతులు మీదుగా నగదు ప్రోత్సాహం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. తనకు ప్రోత్సాహక బహుమతి రావడానికి సహకరించిన ఎస్ఐ, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

రూ.4 లక్షలు పలికిన వారపు సంత

కురబలకోట : మండలంలోని ముదివేడు గ్రామ పంచాయతీకి వారపు సంత వేలంపాట ద్వారా రూ.4 లక్షలు ఆదాయం వచ్చినట్లు పంచాయతీ సెక్రటరీ రామప్ప, సర్పంచులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం రూ.3.79లక్షలు వేలం పాట ద్వారా ఆదాయం వచ్చిందని అన్నారు. వేలంపాటలో గుట్టమీద సాయిబులపల్లెకు చెందిన ఎస్.బక్షు వారపు సంత వేలం పాట ద్వారా దక్కించుకున్నాడు. రెండవ పాట దారుడు ఎస్ .హబీబ్ బాషా పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫిరోజ్, ఎంపిడిఒ దిలీప్‌కుమార్, ఇఒఆర్‌డి, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు బహిరంగ సభలో పాల్గొన్నారు.

వేలంపాట ఆదాయం రూ.10.28 లక్షలు

పెద్దమండ్యం : మండలంలోని పెద్దమండ్యం పంచాయతీకి వారపుసంత, బస్టాండ్‌గేట్‌కు ఇఒఆర్‌డి ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సచివాలయంలో వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో వారపుసంత గతంలో రూ.7.70 లక్షలు ఉండగా, ప్రస్తుతం వెంకటరమణ నాయుడు రూ.9.10లక్షలు, బస్టాండ్ గేట్‌ను షబ్బర్ అహ్మద్‌వలి రూ.1.8లక్షలకు హెచ్చు పాటపాడి దక్కించుకొన్నారు. వేలంపాట ద్వారా గ్రామ పంచాయతీకి రూ.10.28లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాషా, పంచాయతీ కార్యదర్శి జగన్ పాల్గొన్నారు.

రేపు సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక పంచాయతీ పరిధిలోని ఫక్కిర్‌రెడ్డిగారిపల్లి నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని గురువారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు స్వయం సంఘాల మహిళలకు చెక్కును పంపిణీ చేస్తారని ఎంపిపి తెలిపారు. కార్యక్రమానికి జడ్పిటిసి, వైస్ ఎంపిపిలు, గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు హజరవ్వాలన్నారు.

కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


మాట్లాడుతున్న చొప్పాగంగిరెడ్డి

విద్యార్థులు కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ చొప్పా గంగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మెకానికల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో డాక్టర్ చొప్పాగంగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఏకాగ్రతతో చదివితే లక్ష్యాన్ని సులువుగా సాధించవచ్చని సూచించారు. విద్యార్థులు సాంకేతిక విద్యలో నైపుణ్యం కలిగి ఉన్నతమైన శిఖరాలు అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. జూనియర్లు సీనియర్ విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌ఎంవీ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు అభివృద్ధికోసం తమ కళాశాలలో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశామని, కావున విద్యార్థులు కళాశాల అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలన్నారు. చివరగా సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

440 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అక్రమంగా తరలిస్తున్న 440 (90 ఎంఎల్) కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ శివసాగర్ తెలిపారు. వివరాలు.. గుర్రంకొండ మండలం మర్రిపాడు పంచాయతీ మల్లిరెడ్డిగారిపల్లికి చెందిన నరసింహులు (37), పాకాల మండలం, కామాటంపల్లికి చెందిన, ప్రస్తుతం వాల్మీకిపురం పట్టణంకు చెందిన మునిరెడ్డి(44) అక్రమంగా కర్ణాటక మద్యంను తరలిస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు పట్టణంలోని తరిగొండ క్రాస్ వద్ద దాడులు నిర్వహించి, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అలాగే వీరి వద్ద ఉన్న 440 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అక్రమ రవాణా, నాటుసారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని అన్నారు.కార్యక్రమంలో ఎస్ఇబి ఎస్ఐ భాగ్యలక్ష్మీ, సిబ్బంది మంజుల, శోభారాణి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో.. అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రామ్మోహన్ వివరాల మేరకు.. మండలంలోని గొల్లపల్లి పంచాయతీ, హరిజనవాడలో కాపురముండే గంజికుంట మంజునాథ్ అనే వ్యక్తి కర్ణాటక నుంచి మద్యం ప్యాకెట్లను తీసుకొవచ్చి తన ఇంటి ముందు అక్రమంగా విక్రయిస్తుండగా అదుపులోకి తీసు కున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.3,372 విలువ చేసే 90 ఎంఎల్.పరిమాణం కలిగిన 96 ప్యాకెట్లు హైవార్డ్స్ చీర్స్ విస్కీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.నిందితుడినిపై కేసు నమోదు, అరెస్టు చేసి డిమాండుకు తరలించామని హెడ్ కానిస్టేబుల్ రవీందర్ నాయక్ తెలిపారు.

ద్విచక్ర వాహన ప్రమాదంలో బాలుడు మృతి

ప్రజాశక్తి-గాలివీడు

ద్విచక్ర వాహన ప్రమాదంలో బాలుడు మృతి చెందిన సంఘటన గాలివీడులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన నరసింహులు నాయుడు కొడుకు జగన్మోహన్‌నాయుడు(15) ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వాహనం అదుపుతప్పడంతో మామిళ్లవారిపల్లికి చెందిన భూషణ అనే వ్యక్తిని ఢీకొనడంతో ఆయనకు తీవ్ర గాయాలు అయ్యాయి. అనంతరం చెట్టును ఢీ కొట్టాడంతో జగన్మోహన్‌రాజు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన బాలుడిని మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించగా మృతి చెందాడు. మృతదేహాన్ని తిరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి శవపరీక్ష నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.